క్లుప్తంగా


కఠినంగా శిక్షించాలి

కాటారం: చెన్నూర్‌లో దళిత విలేకరిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో జరుగుతున్న అక్రమాలపై పత్రికా ధర్మాన్ని పాటిస్తూ నిజాలు రాసిన విలేకరిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహదేవపూర్: మండల కేంద్రంతో పాటు కాళేశ్వరం, సూరారం, పెద్దంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నర్సరీల సందర్శన



మల్హర్: మండలంలోని రుద్రారం, ఎడ్లపల్లి, కొయ్యూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఏపీఓ గిరి హరీష్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. రోజుకు రెండు సార్లు ఉదయం, సాయంత్రం వాటరింగ్ చేయాలన్నారు. అలాగే ఖాళీగా ఉన్న బ్యాగుల్లో లోకల్ స్టంప్స్, విత్తనాలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్, ప్రసాద్, ఫీల్డ్‌అసిస్టెంట్స్ రవిశంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

సంరక్షణ చర్యలు చేపట్టాలి



శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డీఓనాగపద్మజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కొత్తగట్టుసింగారంలో చెరువు పూడికతీత పనులను, నర్సరీ, తహరాపూర్, శాయంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎండకు మొక్కలు వాడిపోకుండా గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలని, వాచర్‌తో మొక్కలకు నీరు పట్టించాలని సూచించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి రాగా ఏపీఓ కీర్తి అనిత పూలమొక్క అందించి చేనేత వస్త్రాలతో సత్కరించారు. ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసు నమోదు



వాజేడు: ఛత్తీస్‌గఢ్ నుంచి గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో చెరుకూరు గ్రామానికి చెందిన అల్లి వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై గుడుంబా తెస్తుండటంతో అదుపులోకి తీసుకోని ద్విచక్రవాహనాన్ని, గుడుంబాను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటాపురం(కె) : బడి ఈడు వయస్సు కలిగిన పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని వెంకటాపురం ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కాగా గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మద్యం, గంజాయి వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. మద్యపాన నిషేధానికి గ్రామస్తులు, పోలీస్ సమక్షంలో తీర్మానించారు. స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందేందుకు ఎల్లప్పుడు తమ సహకారాలు అందిస్తామని పోలీసులు తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచితులు వచ్చినట్లైతే వారి సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



మహదేవపూర్: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు



టేకుమట్ల: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని బేగ్లూర్ గ్రామంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన పత్రాలు కలిగి ఉండాలని, సరైన పత్రాలు లేకుంటే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల దృష్ట్యా సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడితే చట్ట పరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కాగా, గ్రామానికి రాజక్క, భాగ్యమ్మ, చల్ల రాజమ్మ ఇంట్లో గుడుంబా లభించింది. ఇక ముందు గుడుంబా అమ్మినచో చర్యలు ఉంటామని వారిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, రెండవ ఎస్సై చక్రపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై పింగిళి అమరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులు లింకులను పంపిస్తూ ఓపెన్ చేయమంటూ, బ్యాంక్ ఖాతా వివరాలను అడుగుతూ ప్రలోభాలకు గురి చేస్తూ ఓటీపీలను పంపిస్తూ ఖాతాల్లోని నగదును ఖాళీ చేస్తారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్‌లకు స్పందించరాదన్నారు. అలాగే విద్యార్థులు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్‌లలో గుర్తు తెలియని వ్యక్తులకు ఫొటోలను పంపిచొద్దన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు అవసరం ఉన్నప్పుడు మాత్రమే సెల్ ఫోన్‌లను ఇవ్వాలని, ఎక్కువ సమయం సెల్ ఫోన్‌లలో గడపడం మూలంగా సమయం వృథా కావడంతో పాటు, ఇతర వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో మత్తు పదార్థమైన గంజాయిని విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్ కృష్ణ, ప్రశాంత్ ఉన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లాలి



బహుమతులు అందజేస్తున్న సాయిలు, ఎస్సై

కాటారం: యువత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందు సాయిలు, కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని ఇప్పలగూడెంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే దేశం కోసం ఉరికంభం ఎక్కి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ చరిత్ర చదివితే దేశం, సమాజంపై అతడికి ఉన్న గౌరవం, ప్రేమ, దేశభక్తి అర్థం అవుతాయని పేర్కొన్నారు. యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు కదలాలని సూచించారు. క్రీడలు, చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. శ్రమ, పట్టుదల, ఏకగ్రత ఉంటే ఏదైన సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అభినవ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు కిషోర్, స్మరణ్, కనుకుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ పరిధిలో గల వరిపంటలను ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీపాల్, మండల వ్యవసాయాధికారిణి మేరుగు కళ్యాణిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిపైర్లు పొట్టదశలో ఉన్నాయని, ప్రస్తుతం కాండం తొలిచే పురుగు ఉధృతి ఉన్నట్లు పేర్కొన్నారు. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా ఐసోసైక్లోసిరమ్ 120.మి.లీ పంటపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వారి వెంట ఏఈఓ కావ్య, రైతులు ఉన్నారు.

రాజకీయ కక్షతోనే అరెస్ట్



చిట్యాల: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిట్యాల: ఎమ్మెల్సీ కవితను రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో అక్రమ అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో చేపట్టారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ.. విచారణ పేరుతో ఇన్ని రోజులు అయోమయానికి గురి చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ లోక్‌సభ ఎన్నికల ముందు అకారణంగా కవితను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు గుర్రపు తిరుపతి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, జూకల్ ఎంపీటీసీ జంబుల తిరుపతి, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, నాయకులు దామెర రాజు, చిటుముల రమణాచారి, లిండే శంకర్‌రావు, దొడ్డె శంకర్, శ్రీదేవి, కట్కూరి రాజేందర్, చేర్ల చందు పాల్గొన్నారు.

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం

కాటారం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అప్రజాస్వామికం అని బీఆర్‌ఎస్ పార్టీ కాటారం మండల మహిళా అధ్యక్షురాలు రత్న సౌజన్యరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ అరెస్ట్‌లతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని ఆరోపించారు. అధికారం అడ్డుపెట్టుకొని కల్వకుంట్ల కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. కవితకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విచారణ పేరుతో ఇంటిలో సోదాలు నిర్వహించి హైడ్రామా మధ్య సాయంత్రం అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ కుట్రలకు నిదర్శనం అన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాగరమేష్

మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారానికి చెందిన పూజారి నరేష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ శనివారం పరామర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, రూ.4000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.పెసా జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, రూప భద్రయ్య, ట్రస్టు వైస్ చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు ఇందారపు రమేష్, మునిగెల మహేష్, చౌళం వేణు, కొమరం నితిన్, జయరాజు, రవి, శివ, వెంకన్న, ప్రవీణ్ ఉన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: కుటుంబంలో ఒక విద్యార్థి విద్య నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం(ఆర్ఓఎస్ఏ) అధ్యక్షుడు చాప బాబుదొర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్పోర్ట్స్ గురుకుల కళాశాల, పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్న 70 మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఐఆర్‌ఎస్, జడ్జీ, లాయర్లు, తహసీల్దార్, డాక్టర్లు, తదితర ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. మీరు కూడా ఉన్నత విద్య చదువుకొని తల్లిదండ్రులకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజారామ్, సంఘం ఉపాధ్యక్షుడు కొమురం ప్రభాకర్, కార్యదర్శి పుల్సం పురుషోత్తం, భవాని శంకర్, రవీందర్, ఉస్సిలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సత్యనారాయణ

శాయంపేట : పొదుపు చేయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని శ్రీరామ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు కడివెండి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నేరేడుపల్లిలో శ్రీరామ పొదుపు సంఘం 28వ వార్షిక మహాసభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1995 సంవత్సరంలో ఏర్పడిన సంఘం ఇప్పటివరకూ 653 మందితో రూ.2.91 కోట్ల నిధులు సమకూర్చినట్లు తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 22 లక్షల మిగులు వచ్చిందన్నారు. భవిష్యత్తులో సభ్యత్వాన్ని పెంచి అప్పు అర్హత కూడా పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, సంఘ ఉపాధ్యక్షులు మొత్కూరి భాస్కర్, ఆకుతోట పూర్ణచందర్, సయ్యద్ వలి, తాత మోహన్, దొడ్డిపాక రాజు, మోహన్, కృష్ణమూర్తి, రాంబాబు, రవి, రాజ్ కుమార్, రాజు, మోహన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అందులో భాగంగా 338 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 158 మంది విద్యార్థులు, అలాగే గురుకుల పాఠశాలలో 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను, లైటింగ్, ఫర్నీచర్, ఫ్యాన్లు, తాగు నీటి సమస్య లేకుండా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ నెల 18 నుంచి ఉదయం 9:30 నిమిషాలకు పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న మమత

మహాముత్తారం: పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత అన్నారు. పోషన్ పక్వాడ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నిమ్మగూడెం, మాదారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాల గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, స్వప్న, లత, మహాలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కుంగ్-ఫూతో బాలికలకు ఆత్మరక్షణ



సర్టిఫికెట్లు, బెల్టులు అందుకుంటున్న విద్యార్థులు

కాళేశ్వరం: కుంగ్-ఫూ నేర్చుకోవడంతో బాలికలకు ఆత్మస్థైర్యం పెంపొందడంతోపాటు, ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని హెచ్ఎం సత్యం అన్నారు. మండల కేంద్రంలో శనివారం జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్-ఫూ ఆధ్వర్యంలో బెల్టుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు, ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. మూడు నెలలుగా పాఠశాలలో మాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో కుంగ్-ఫూలో శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులకు ఎల్లో (పసుపు రంగు) బెల్ట్‌లతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్-ఫూ అకాడమీ ఫౌండర్ రాజమల్లు, ప్రెసిడెంట్ రాజేందర్, వైస్ ప్రెసిడెంట్ కూరపాటి మహేష్, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, కుంగ్-ఫూ మాస్టర్ చంద్రయ్య, పాఠశాల హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు సరిత, సతీష్, సీత రామలక్ష్మి, పూర్ణిమ, స్వరూపరాణి పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ప్రతాప్

వాజేడు: భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. 5వ షెడ్యూల్ భూభాగమైన భద్రాచలం కేంద్రంలో ఆదివాసీ యువత కోసం న్యాయ కళాశాల అవసరమన్నారు. ఆదివాసీ చట్టాలు, జీఓలు ఉన్నప్పటికీ పాలకులు చట్టాలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. ఆదివాసీ యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ నాయకులు ఆదివాసీల హక్కులు, చట్టాలను కాలరాస్తూ పార్టీల జెండాలను మోయిస్తున్నారని విమర్శించారు. జరుగనున్న పార్లమెంటు ఎన్నికల కోసం తయారు చేసే మేనిఫేస్టోలో 1/70, పెసా చట్టాలను అమలు చేస్తామని పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణ, కృష్ణ, రాజేష్, చంటి, సమ్మయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మల్హర్: పైపు లైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మల్హర్‌రావు



కాళేశ్వరం: పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ మమత

మల్హర్: మండలంలోని తాడిచర్ల, పెద్దతూండ్ల, అడ్వాలపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. తాడిచర్ల ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా పైప్‌లైన్, వెంకటేశ్వర ఆలయంలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.1.50 లక్షల వ్యయంతో బోర్ వెల్, నూతన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రూ.1.75 లక్షల(డీఎంఎఫ్‌టీ) నిధులతో బోర్‌వెల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అలాగే పెద్దతూండ్ల గ్రామంలో మెటల్ రోడ్లు, సీసీ రోడ్లుకు, అడ్వాలపల్లి గ్రామ పంచాయతీలోబోర్‌వెల్, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామ్ సుందర్, కార్యదర్శులు మల్లికార్జున్, సతీష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండల కేంద్రంతో పాటు మాదారం, కొర్లకుంట గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల నిర్మాణానికి శనివారం మహాముత్తారం జెడ్పీటీసీ లింగమల్ల శారద భూమిపూజ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీ నిర్మాణాలతో పాటు విద్యుత్ నిర్మాణాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ఏర్పాటుకు భూమి పూజ

మహదేవపూర్: మండలంలోని ఎనుకపల్లి గ్రామంలో రూ.2 లక్షల నిధులతో బోర్‌వెల్‌కు జెడ్పీటీసీ అరుణ శనివారం భూమి పూజ నిర్వహిచారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్) ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి మంచి నీరును అందించుటకు బోర్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామం ఒకటవ వార్డులోని ఎస్సీ కాలనీలో వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి బోరు వెల్ కోసం ఎంపీటీసీ మమత శనివారం భూమి పూజ చేశారు. మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షల మంజూరు కాగా, బోర్ మోటార్ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రేవెల్లి శ్రీనివాస్,బండెల రాములు, కోండ్ర సడవలి, బండెల సంపత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏటీఓ ముబీన్

ఏటూరునాగారం : మంగపేట మండలంలోని కమలాపురం జెడ్పీఎస్ఎస్ పదో విద్యార్థులకు ఐటీఐలో ప్రవేశానికి ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు ఐటీఐ ఏటీఓ వావిలాల ముబీన్ కుమార్ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐలో చేరాలని ఆయన కోరారు. పదోతరగతి, ఐటీఐ చదవడం వల్ల కలిగే లాభాలను, ఐటీఐ అవశ్యకతను, ప్రవేశాలకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410